క్లుప్తంగా

సమగ్ర సర్వే పరిశీలన



సర్వేను పరిశీలిస్తున్న తహసీల్దార్

అర్వపల్లి : సమగ్ర కుటుంబ సర్వేకు ఇళ్ల వద్ద అందుబాటులో లేనివారు మరుసటి రోజు ఎన్యుమరేటర్లను సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు కోరారు. శుక్రవారం అర్వపల్లిలో ఇంటింటి కుటుంబ సర్వేను పరిశీలించారు. సర్వేలో తప్పులు దొర్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎన్యుమరేటర్లకు సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఉపేందర్, ఎన్యుమరేటర్లు మల్లేశ్వరి, సరిత, చంద్రకళ పాల్గొన్నారు.

రాయితీ కల్పించాలి

సూర్యాపేట : 60 ఏళ్లు పైబడిన వయోవృద్ధులకు ఆర్టీసీ ప్రయాణంలో 25శాతం రాయితీ కల్పించాలని సామాజిక వేత్త, విశ్రాంత ప్రభుత్వ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గుండా రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 60 ఏళ్లు పైబడిన వయోవృద్ధులకు ఆ రాష్ట్ర ఆర్టీసీలో ప్రయాణించే వారికి 25శాతం రాయితీ కల్పిస్తూ ఈ నెల 13న ఉత్తర్వులు వెలువరించిందని తెలిపారు. తెలంగాణలో కూడా సీనియర్ సిటిజన్స్‌కు ఆర్టీసీలో 25శాతం రాయితీ కల్పించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చివ్వెంల : కుడకుడ గ్రామంలోని పలు కాలనీలకు శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగనున్నట్లు విద్యుత్ ఏఈ మల్లయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్రామంలో విద్యుత్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్టు కొమ్మలను తొలగించే క్రమంలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు పేర్కొన్నారు. వినాయక్ నగర్, స్నేహ నగర్, లింగా నగర్, పీఎస్ఆర్, జీఎంఆర్ టౌన్ షిప్, భాగ్యనగరం ఎస్సీకాలనీలలో విద్యుత్ సరఫరా నిలిచిపోనున్నట్లు తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ


చెక్కు పంపిణీ చేస్తున్న పీఏసీఎస్ చైర్మన్

అర్వపల్లి : మండల పరిధిలోని కొమ్మాల గ్రామానికి చెందిన గడ్డం యల్లమ్మ ఇటీవల అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది. అయితే ఆమెకు ఆస్పత్రిలో అయిన వైద్య ఖర్చుల కింద ఎమ్మెల్యే సామేల్ ద్వారా మంజూరైన రూ.17వేల చెక్కును శుక్రవారం మృతురాలి కుటుంబీకులకు జాజిరెడ్డిగూడెం పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మందడి పూర్ణచంద్రారెడ్డి, గడ్డం ఉప్పలయ్య, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

కొనుగోళ్లలో వేగం పెంచాలి


జాజిరెడ్డిగూడెం ఐకేపీ కేంద్రంలో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు

అర్వపల్లి : ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలని తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం జాజిరెడ్డిగూడెం, కొమ్మాలలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి నిర్వాహకులకు తగు సూచనలు ఇచ్చారు. కాంటాలు అయిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు పంపాలని కోరారు. వర్షం పడితే ధాన్యం తడవకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచించారు. 17శాతం వరకు తేమ ఉండేలా ధాన్యాన్ని ఆరబెట్టి శుభ్రం చేసి తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ ఏపీఎం వలిశెట్టి మల్లేష్, నిర్వాహకులు పాల్గొన్నారు.

పశుగణన ప్రారంభం

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెం మండలం అర్వపల్లిలో పశుగణన కార్యక్రమాన్ని శుక్రవారం మండల పశువైద్యాధికారి డాక్టర్ బి.అర్జున్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి వరకు పశుగణన గ్రామగ్రామాన జరుగుతుందని తెలిపారు. ఇంటింటికీ వచ్చే పశు వైద్యసిబ్బందికి రైతులు, ప్రజలు సహకరించి పశువులు, ఇతర జంతువుల వివరాలను అందజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది యాకయ్య, మధుసూదన్, రైతు నీలం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.


అర్వపల్లిలో పశుగణన చేస్తున్న వైద్యసిబ్బంది

సన్న ధాన్యం కొనుగోళ్లు ఆలస్యం

- తూకానికి నోచుకోని ధాన్యం బస్తాలు
- రోజుల కొద్ది అన్నదాతల ఎదురుచూపు


అనంతారం కొనుగోలు కేంద్రంలో ఉన్న ధాన్యం రాశులు

తిరుమలగిరి : రైతులకు పంటలు అమ్ముకోవడానికి ఇబ్బందులు తప్పడం లేదు. నెల రోజుల క్రితం వరి కోసుకొని ధాన్యంతో కొనుగోలు కేంద్రాలకు వచ్చిన రైతులు నేటి వరకు ఎదురుచూడాల్సిన పరిస్థితి వచ్చింది. తిరుమలగిరి మండలంలోని పలు గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించినా సన్న ధాన్యానికి కాంటాలు వేయకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఆకాశం మబ్బులు పట్టడం, వర్షాలు కురుస్తుండటంతో రైతులు భయాందోళనకు గురవుతున్నారు. తిరుమలగిరి మండల కేంద్రంలో సన్న ధాన్యం కొనుగోలు కోసం ఐకేపీ, పీఏసీఎస్, మెప్మా ఆధ్వర్యంలో 8 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు ఒక్క రాఘవపురం కేంద్రంలో తప్ప ఏ కేంద్రంలో కూడా కొనుగోళ్లు ప్రారంభం కాలేదు.

ఇబ్బందులు పడుతున్న రైతులు..

ప్రభుత్వం సన్న ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 చొప్పున అదనంగా బోనస్ ఇస్తామని ప్రకటించడంతో ఈ వానా కాలం సీజన్‌లో రైతులు ఎక్కువగా సన్న ధాన్యం సాగుచేశారు. మండలంలో నెల రోజుల నుంచి వరి కోతలు ప్రారంభమయ్యాయి. రూ.500 బోనస్ వస్తుందనే ఆశతో రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యం బస్తాలను తీసుకొచ్చారు. కానీ కాంటాలు ప్రారంభం కాలేదు. కొనుగోలు కేంద్రాలకు ధాన్యం తీసుకొచ్చిన రైతులకు వాటిపై కప్పడానికి పట్టాలు అవసరమవుతున్నాయి. ఒక్కో పట్టాకు రోజు కిరాయి రూ.40 చెల్లించాల్సి వస్తుంది. అలాగే ధాన్యంలో తేమ శాతం తగ్గడానికి ప్రతిరోజు ఆరబెట్టి దగ్గరకు చేయడానికి రోజుకు రూ.1000 నుంచి రూ.2000 ఖర్చవుతుందని రైతులు వాపోతున్నారు.

మార్కెట్ వైపే మొగ్గు..

కాంటాలు ఆలస్యం కావడంతో రైతులు దిక్కు తోచని స్థితిలో ఉన్నారు. వారాల తరబడి ధాన్యం రాశుల వద్ద నిద్ర లేని రాత్రులు గడపాలంటే మావల్ల కాదంటూ ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తున్నారు. పచ్చి వడ్లను మార్కెట్‌లో క్వింటాల్‌కు రూ. 1900 నుంచి రూ.2100లకు అమ్మేస్తున్నారు. ఇప్పటికైనా వేగవంతంగా కాంటాలు వేయాలని కోరుతున్నారు.

కాంటాలు ప్రారంభం కాలేదు



కొనుగోలు కేంద్రానికి నెల రోజుల క్రితం ధాన్యాన్ని తీసుకొచ్చాను. కానీ కాంటాలు ప్రారంభం కాలేదు. ప్రతి రోజు కేంద్రం వద్దకు వచ్చి ఉండాల్సి వస్తుంది. వాతావరణంలో మార్పులతో వర్షం పడుతుందని భయమవుతోంది.

– దేశగాని యాదగిరి, రైతు

50 బస్తాల ధాన్యం తీసుకొచ్చాను



ఈసారి ప్రభుత్వం బోనస్ ఇస్తుందని సన్న ధాన్యం పంట వేశాను. కొనుగోలు కేంద్రానికి 50 బస్తాల ధాన్యాన్ని తీసుకొచ్చాను. ప్రతిరోజు కేంద్రం వద్దనే ధాన్యాన్ని ఆరబెడుతున్నాను. ఇప్పటి వరకు కాంటాలు ప్రారంభం కాలేదు.

– కల్లెం సాయిలు, రైతు

కనులపండువగా నర్సింహస్వామి కల్యాణం


కల్యాణోత్సవంలో పాల్గొన్న మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిషోర్, తదితరులు

అర్వపల్లి : అర్వపల్లిలోని శ్రీయోగానందలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో సూర్యాపేట మున్సిపల్ కౌన్సిలర్ మొరిశెట్టి సుధ–శ్రీనివాస్ దంపతులు శుక్రవారం నర్సింహస్వామి కల్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ ఉత్సవానికి మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి–సునీత, తుంగతుర్తి మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్–కమల దంపతులు, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపికయుగంధర్‌రావు, మాజీ వైస్ ఎంపీపీ గుంటకండ్ల మణిమాల, మొరిశెట్టి శ్రీనివాస్–సుధ దంపతులు హాజరై పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు గుండగాని సోమేష్‌గౌడ్, మారి పెద్ది శ్రీనివాస్‌గౌడ్, సూర్యాపేట మాజీ జెడ్పీటీసీ జీడి భిక్షం, మొరిశెట్టి ఉపేందర్, సంకేపల్లి రఘునందన్‌రెడ్డి, కొమ్మినేని సతీష్, తాటికొండ సీతయ్య, ధూపటి రవీందర్, వల్లపు గంగయ్య, బొడ్డు రామలింగయ్య, కొప్పుల సోమిరెడ్డి, కూరం వెంకన్న, కడారి నరేష్, నున్న గిరి పాల్గొన్నారు.

గ్రూప్‌–4 ఉద్యోగానికి ఎంపిక

- ఆత్మకూరు మండలం నుంచి ఏడుగురు
- జూనియర్ అసిస్టెంట్లుగా స్టాలిన్, తేజస్వి
- వార్డు ఆఫీసర్‌గా శ్రీనివాస్‌రెడ్డి
- మున్సిపల్ శాఖలో ఉద్యోగానికి శివాజీ..
- చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్‌లో శిరీషకు ఉద్యోగం
- ఏపూరు, రామన్నగూడెం నుంచి ఇద్దరు

ఆత్మకూర్ (ఎస్) : ఇటీవల తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన గ్రూప్‌–4 మెరిట్ జాబితాలో ఆత్మకూరు మండల వాసులు పలువురు ఉద్యోగాలు సాధించారు. మండల పరిధిలోని నశింపేట గ్రామానికి చెందిన దంతూరి సోమన్న వెంకటరమణల కుమారుడు స్టాలిన్ ఉస్మానియా యూనివర్సిటీలో జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగం సాధించాడు. మండల కేంద్రానికి చెందిన విసవరం ప్రతాపరెడ్డి, సువర్ణల చిన్న కుమారుడు శ్రీనివాసరెడ్డి వార్డు ఆఫీసర్‌గా ఉద్యోగం సాధించాడు. కోటపహాడ్ గ్రామానికి చెందిన బొబ్బ వీరారెడ్డి కుమార్తె బొబ్బ తేజస్వి ఉస్మానియా యూనివర్సిటీలో జూనియర్ అసిస్టెంట్‌గా సెలెక్ట్ అయ్యారు. బొప్పారం గ్రామానికి చెందిన బాషపంగు లింగయ్య కుమారుడు శివాజీ మున్సిపల్ శాఖలో ఉద్యోగం సాధించాడు. అలాగే ఇస్తాళపురం గ్రామానికి చెందిన తూడి వెంకన్న కుమార్తె శిరీష చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్‌లో ఉద్యోగం సాధించింది. ఏపూరుకు చెందిన పరికపల్లి లింగస్వామి, రామన్నగూడేనికి చెందిన నందా శృతిలు ఉద్యోగాలు సాధించారు.

వారం రోజులుగా నిలిచిన నీటి సరఫరా

- తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్న పలు గ్రామాల ప్రజలు
- త్వరగా సమస్య పరిష్కరించాలని వినతి


అర్వపల్లిలోని మిషన్ భగీరథ ట్యాంక్

అర్వపల్లి : మిషన్ భగీరథ నీళ్లు సక్రమంగా రాక గ్రామాల్లో నీటికి కటకట ఏర్పడుతోంది. పాలేరు రిజర్వాయర్ వద్ద మంచినీటి పథకాల మోటార్లు కాలిపోవడంతో నీళ్లు నిలిచిపోయినట్లు మిషన్ భగీరథ సిబ్బంది చెబుతున్నారు. గ్రామాల్లో పూర్తిగా మిషన్ భగీరథ నీరే ఆధారం కావడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గ్రామపంచాయతీల రక్షిత మంచినీటి పథకాల బోర్లు ఉన్నప్పటికీ కొన్ని మాత్రమే పనిచేస్తున్నాయి.

ఐదు మండలాలకు నిలిచిపోయిన నీళ్లు..

నియోజకవర్గంలోని తుంగతుర్తి, నూతనకల్, జాజిరెడ్డిగూడెం, మద్దిరాల, నాగారం మండలాలలోని 168 గ్రామాలకు పాలేరు రిజర్వాయర్ నుంచి చిల్పకుంట్ల ప్లాంట్ ద్వారా మిషన్ భగీరథ నీళ్లు సరఫరా అవుతున్నాయి. అయితే పాలేరు రిజర్వాయర్ వద్ద విద్యుత్ సమస్యతో మోటార్లు కాలి నీటి సరఫరా నిలిచిపోయింది. వారం రోజులుగా నీళ్లు బంద్ కావడంతో గ్రామాల్లో నీటికి కటకట ఏర్పడింది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ఆయా మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలకు కూడా నీటి సరఫరా నిలిచిపోవడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇక్కట్ల పాలవుతున్నారు. మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు కూడా వంటలకు ఇబ్బంది అవుతోంది. అధికారులు స్పందించి నీటి సరఫరా పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు.

నీళ్లు రావడం లేదు



జాజిరెడ్డిగూడెం మండల కేంద్రానికి వారం రోజులుగా మిషన్ భగీరథ నీళ్లు నిలిచిపోయాయి. తరచుగా ఈ పథకం నీళ్లు నిలిచిపోతుండటంతో గ్రామాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వెంటనే మరమ్మతులు చేపట్టి సమస్యను తీర్చాలి.

– బింగి కృష్ణమూర్తి, జాజిరెడ్డిగూడెం

మాటిమాటికీ బందవుతున్నాయి



తుంగతుర్తి నియోజకవర్గంలో చిల్పకుంట్ల ప్లాంట్ ద్వారా నీటి సరఫరా జరిగే గ్రామాలకు తరచుగా మిషన్ భగీరథ నీళ్లు బందవుతున్నాయి. మోటార్లు కాలిపోవడం, పైపులైన్లు పగలడం తదితర సమస్యలతో నీళ్లు నిలిచిపోతుండటంతో గ్రామాల్లో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– మచ్చ నర్సయ్య, కాసర్లపహాడ్

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

నూతనకల్ : మండల పరిధిలోని పెద నెమిల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2011–12 సంవత్సరం 10వ తరగతి బ్యాచ్ విద్యార్థులు శుక్రవారం చిన నెమిల క్రాస్ రోడ్డులో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకున్నారు. ఆనాడు విద్యాబోధన చేసిన గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు శివయ్య, ఉపాధ్యాయులు హైమావతి, శ్రీలత, సరోజన, సైదులు, ఉప్పయ్య, మధుసూదన్, రవీందర్, ఉప్పలయ్య, విద్యార్థులు సంజీవ్, మమత తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

మద్దిరాల : దంతాలపల్లి–సూర్యాపేట ప్రధాన రహదారి సమీపంలో శుక్రవారం విద్యుదాఘాతంతో గేదె మృతి చెందింది. మండల కేంద్రానికి చెందిన అకంటి శ్రీను మద్దిరాల శివారులో గేదెను మేతకు తీసుకెళ్లాడు. గేదె మేత మేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ తీగలకు తగిలి విద్యుదాఘాతానికి గురైంది. దీంతో అక్కడిక్కడే మృతి చెందింది.

ఎల్‌ఓసీ అందజేత

నాగారం : మండల కేంద్రానికి చెందిన అనంతుల సోమశేఖర్ తండ్రి వెంకన్న మోకాలుకు చికిత్స పొందుతున్నాడు. కానీ ఆర్థికంగా ఇబ్బంది పడుతుండడంతో కాంగ్రెస్ నాయకుడు జాజుల వీరయ్య విషయాన్ని మంత్రి వెంకట్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో బాధితుడికి రూ.90,000 ఎల్‌ఓసీ మంజూరు కాగా శుక్రవారం బాధితుడికి అందజేశారు.

శ్రీసంతోషిమాత ఆలయంలో పూజలు


సంతోషిమాత ఆలయంలో పూజలో పాల్గొన్న భక్తులు

సూర్యాపేటటౌన్ : కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని సంతోషిమాత ఆలయంలో శుక్రవారం శ్రీ సంతోషిమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం జరిపారు. అమ్మవారి సన్నిధిలోని శ్రీ చక్రానికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. ఉద్యాపన వ్రతంతోపాటు వడిబియ్యం కార్యక్రమాలు జరి పారు. సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతా లు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ ప్రధాన అర్చకుడు ఇరువంటి శివ రామకృష్ణ శర్మ, దేవాలయ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం


బహుమతులతో విద్యార్థులు

సూర్యాపేటటౌన్ : జిల్లా కేంద్రంలోని బాలభవన్‌లో గురువారం రాత్రి బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులకు లలిత కళలపై పోటీలు ఏర్పాటు చేశారు. విజేతలైన వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విశ్రాంత అధ్యాపకుడు హమీద్‌ఖాన్ మాట్లాడారు. సంస్కృతి, సంప్రదాయాలను తెలిపే కళలను పిల్లలు శిక్షణ పొంది ప్రదర్శన ఇవ్వడం బాగుందన్నారు. ప్రతి ఒక్కరూ ఏదో ఒక కళను నేర్చుకోవాలని, దీని వల్ల స్ట్రెస్ లైఫ్ నుంచి బయట పడొచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో అనంతుల జయమ్మ, హెచ్‌ఎం పద్మ, సూపరింటెండెంట్ రాధాకృష్ణ రెడ్డి, సిబ్బంది యల్లయ్య, సింగ్, ఉమ, అనిల్, సాయి, వీరు, పద్మ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

29న సూర్యాపేటలో సీపీఎం బహిరంగ సభ


మాట్లాడుతున్న కొలిశెట్టి యాదగిరి రావు

తుంగతుర్తి : సీపీఎం సూర్యాపేట జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరి రావు అన్నారు. శుక్రవారం తుంగతుర్తి మండల కేంద్రంలోని వీఎస్ భవనంలో ఆ పార్టీ మండల కమిటీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ నెల 29, 30, డిసెంబర్ 1వ తేదీలలో జరిగే సీపీఎం జిల్లా సభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ సభల సందర్భంగా 29వ తేదీన సూర్యాపేటలో భారీ బహిరంగ సభ ఉంటుందన్నారు. ఈ మహాసభలలో గత మూడు సంవత్సరాల కాలంలో పార్టీ నిర్వహించిన కార్యక్రమాలు, రాబోయే కాలంలో అనుసరించే విధానాలను చర్చించనున్నట్లు తెలిపారు. అనంతరం నూతన కమిటీల ఎంపిక ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బుర్ర శ్రీనివాస్, మండల కమిటీ సభ్యులు పల్లా సుదర్శన్, ఎల్లయ్య, ముత్తయ్య, దేవరాజు, బోనాల వెంకన్న, యాదగిరి, జానయ్య, ప్రభాకర్ పాల్గొన్నారు.

సమగ్ర కులగణన సర్వేను విజయవంతం చేయాలి


తుంగతుర్తిలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

తుంగతుర్తి : తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న సమగ్ర కుల గణన సర్వేను విజయవంతం చేయాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తన్నీరు రాంప్రభు అన్నారు. శుక్రవారం తుంగతుర్తి మండల కేంద్రంలో సమగ్ర సర్వే చైతన్య పోస్టర్లను ఆవిష్కరించి మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు అయినా ఏ పార్టీ కూడా సమగ్ర కుల గణన చేయలేదని అన్నారు. కుల గణన జరిగితే ఇంతవరకు రాజకీయ ప్రాతినిధ్యం లేని కులాలకు కూడా రాజకీయాల్లో ప్రాధాన్యం లభిస్తుందని అన్నారు. ప్రతి కులానికి జనాభా ప్రకారం బడ్జెట్ కేటాయింపు జరిపేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు కొండరాజు, పెద బోయిన అజయ్ కుమార్, పులుసు వెంకటనారాయణగౌడ్, అంబటి రాములు, పెండెం మధుసూదన్, కటకం వెంకటేశ్వర్లు, పులుసు వెంకన్న గౌడ్, ఎనగందుల సంజీవ, ఎండీ రఫీక్, కొండ రవి, గోపగాని రమేష్, కోకోల నరేష్ పాల్గొన్నారు.

వైభవంగా కార్తీక పౌర్ణమి వేడుకలు


సూర్యాపేట : పాత శివాలయంలో శివుడికి పాలాభిషేకం చేస్తున్న భక్తులు


సూర్యాపేట : పాత శివాలయంలో పాలాభిషేకం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, తదితరులు


సూర్యాపేట : జిల్లా కేంద్రంలోని పాత శివాలయంలో పూజలు..


నూతనకల్‌లోని శ్రీ శంభులింగేశ్వరస్వామి ఆలయంలో పూజలు..


సూర్యాపేట : రామలింగేశ్వర ఆలయంలో..


అర్వపల్లిలోని దేవాలయంలో దీపాలు..


చివ్వెంలలోని శివాలయంలో..


పెన్‌పహాడ్ : నాగులపహాడ్‌లోని శ్రీ త్రికుటేశ్వర ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు


ఆత్మకూరు శివాలయంలో గోమాతకు పూజలు


తుంగతుర్తి: కొత్తగూడెంలో దీపాలు వెలిగిస్తూ..


మద్దిరాల: పార్వతీరామలింగేశ్వర ఆలయంలో..


సూర్యాపేట : విద్యానగర్‌లోని రామలింగేశ్వర ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు


సూర్యాపేట : పాత శివాలయంలో గోమాతకు పూజలు చేస్తున్న భక్తులు